క్లుప్తంగా

వాహనాల వేలం రేపు

సాలూరు: పట్టణం, మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ సారా కేసుల్లో పట్టుకున్న వాహనాలకు మంగళవారం వేలం వేయనున్నట్లు పట్టణ, రూరల్ పోలీసులు వేర్వేరు ప్రకటనల్లో ఆదివారం తెలిపారు. పట్టణస్టేషన్ పరిధిలో పట్టుకున్న 9 ద్విచక్రవాహనాలు, 2 కార్లు, 1 వ్యాన్‌కు, రూరల్ స్టేషన్ పరిధిలో పట్టుకున్న 10ద్విచక్ర వాహనాలు, 1 ఆటో, 1 జీపును వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహికులు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

మినిమం టైం స్కేల్‌ను అమలు చేయాలి



వేడుకోలు దీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు

పార్వతీపురం: సమగ్రశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్‌చేస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ పార్ట్ టైం ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్ ఎదుట వేడుకోలు దీక్ష నిర్వహించారు. కనీస వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు బీవీ రమణ, ఈశ్వరరావు, నరసింహాచారి తదితరులు ఉన్నారు.

ఘనంగా దేశమ్మతల్లి వారాల పండగ



ఘటాలను ఊరేగిస్తున్న దృశ్యం

మక్కువ: మండల కేంద్రం మక్కువలో దేశమ్మ తల్లి వారాల పండగ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఘటాలకు భక్తులు చీరలు, కోళ్లు సమర్పించి మొక్కుబడి తీర్చుకున్నారు. వర్షం కురుస్తున్నప్పటికీ భారీ జనసందోహంతో అమ్మవారి ఘటాలను ప్రధాన రహదారి గుండా ఊరేగించి, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఉన్న గద్దె వద్దకు తీసుకెళ్లారు. యువత కేరింతలు, కోలాహలం, డప్పులు, బిందెల డ్యాన్స్‌తో ఊరేగింపు యాత్ర సాగింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తగుచర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, డీసీసీబీ డైరెక్టర్ మావుడి తిరుపతినాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మెనూ చార్జీలు పెంచాలి

గుమ్మలక్ష్మీపురం: కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థుల భోజనాలకు సంబంధించి, మెనూ చార్జీలు పెంచాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ ఏకలవ్య, ఆశ్రమ పాఠశాలల వసతిగృహాల విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి రూ.1400 నుంచి రూ.2,205కి పెంచిందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా మెనూ చార్జీలు పెంచే దిశగా ఆలోచన చేయాలని కోరారు.

చురుగ్గా రోడ్డు మరమ్మతులు



గోతుల్లో గ్రావెల్ నింపుతున్న దృశ్యం

భామిని: మండల కేంద్రంలోని ఏబీ రోడ్డు మరమ్మతులు ఆదివారం చేపట్టారు. ఎక్కడికక్కడ గోతులమయమైన రోడ్డు కారణంగా అటువైపుగా రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. బత్తిలి ఎస్‌ఐ యతిరాజుల అమ్మనరావు ఆధ్వర్యంలో పోలీసులే స్వయంగా గోతులను గ్రావెల్‌తో నింపి, రోడ్డును బాగు చేయించారు.

బదిలీ ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడు వాసును సన్మానిస్తున్న పాతఘనసర గ్రామస్తులు

భామిని: మండలంలోని పాతఘనసర ఎంపీపీ స్కూల్‌లో పనిచేస్తూ వీరఘట్టం మండలానికి బదిలీ అయిన ఉపాధ్యాయుడు వెంగలి వాసును పాతఘనసర గ్రామంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. సేవలే గుర్తింపునిస్తాయని, ఇదే స్ఫూర్తితో పనిచేయాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సా ర్ సీపీ కార్యదర్శి కిల్లారి పాల్గుణరావు, మాజీ ఎంపీపీ బి.ఆనందరావు, మాజీ ఎంపీటీసీ కిల్లారి కాంతారావు, ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజన్నదొర చొరవతో ముమ్మరంగా అభివృద్ధి



పట్టణంలో దండిగాం రోడ్డు వద్ద ఇటీవల నిర్మించిన పైలెట్ వాటర్ స్కీమ్



వెంకటేశ్వర కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు

సాలూరు: ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర చొరవతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మున్సిపాలిటీ 15వ ఆర్థిక సంఘం, గడపగడపకు మనప్రభుత్వం నిధులు సుమారు రూ.50 లక్షలతో ప్రస్తుతం మున్సిపాలిటీలోని వార్డుల్లో పనులు చేపట్టారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పైలెట్ వాటర్ స్కీమ్‌లు, తదితర అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయి. చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు సత్వరమే చెల్లింపు జరిగేలా ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. బిల్లులు పెండింగ్ లేవని, అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మున్సిపాలిటీలోని కౌన్సిలర్లను రాజన్నదొర ఆదేశించారు. పనులు స్థానిక కౌన్సిలర్‌లు, నాయకులు చేపట్టలేని పక్షంలో వేరే కాంట్రాక్టర్‌లకు అప్పగించైనా పనులు పూర్తిచేయిస్తానని రాజన్నదొర స్పష్టం చేశారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా వార్డుల్లో పర్యటించిన రాజన్నదొర స్థానిక సమస్యలను గుర్తించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులు నేరుగా ప్రజలు, స్థానిక నాయకులతో మాట్లాడి తెలుసుకున్నారు. రాజన్నదొర చొరవతో ఇప్పటికే కోట్లాది రుపాయల అభివృద్ధి పనులు మున్సిపాలిటీలో జరిగాయని మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ లోగిశ సూరినాయుడు తెలిపారు.

మిషన్ ఇంద్రధనుష్‌ను విజయవంతం చేయాలి

- నేటి నుంచి రెండవ విడత టీకా కార్యక్రమం
- డీఐఓ టి.జగన్‌మోహన్‌రావు



పార్వతీపురం టౌన్: మిషన్ ఇంద్రధనుష్ టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం నుంచి శనివారం వరకు జిల్లావ్యాప్తంగా జరగబోయే మిషన్ ఇంద్రధనుష్ రెండో దశ టీకా కార్యక్రమానికి సంబంధించి ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. ఐదేళ్లలోపు పిల్లలు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వైద్యసిబ్బంది వేయనున్నారని తెలిపారు. ముఖ్యంగా షెడ్యూల్ ప్రకారం గతంలో ఏవైనా కారణాల వల్ల టీకా వేసుకోని పిల్లలను సర్వేలో గుర్తించి ప్రస్తుత కార్యక్రమంలో టీకా పూర్తి చేస్తారని చెప్పారు. వారితో పాటు ఈ వారంలో షెడ్యూల్ ప్రకారం టీకా అర్హులు కూడా ఉంటారన్నారు. ఇందుకు సంబంధించి జిల్లాలో ఉన్న 37పీహెచ్‌సీలు, 5 పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో 560 టీకా కేంద్రాల్లో 1332 మంది పిల్లలకు, 339 మంది గర్భిణులకు వైద్యసిబ్బంది టీకా వేయనున్నారన్నారు. టీకా పూర్తి చేసిన వివరాలన్నీ యూవిన్ పోర్టల్‌లో నమోదు చేస్తారని, ఈ విధానం ద్వారా సచివాలయం పరిధిలోనే టీకా ధ్రువీకరణ పత్రాన్ని పొందే వీలు ఉంటుందని తెలిపారు. ఇప్పటికే మొదటి దశ ఆగస్టు నెలలో పూర్తయిందని, ప్రస్తుతం రెండో దశ అని, అక్టోబర్ నెలలో మూడో దశ ఉంటుందని డాక్టర్ జగన్‌మోహన్‌రావు తెలిపారు. టీకా నిర్వహణను బలోపేతం చేసే దిశగా, తట్టు, రుబెల్లా తదితర వ్యాధుల పూర్తిస్థాయి నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ ఇంద్రధనుష్ టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మీడియా ద్వారా ఆయన కోరారు.

పీహెచ్‌సీలో 110 మందికి కంటి వైద్య పరీక్షలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు శిరీష, సీహెచ్ శారద

సీతానగరం: డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు పథకం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అంధత్వ నివారణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చిందని పీహెచ్‌సీ డాక్టర్ శిరీష, శంకర్ ఫౌండేషన్, సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ కంటి వైద్యురాలు సీహెచ్ శారద అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పీహెచ్‌సీలో ప్రభుత్వ వైద్యులు, శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచితనేత్ర వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, సిబ్బంది మాట్లాడుతూ ఉచిత నేత్ర వైద్యశిబిరంలో వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న 110 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలియజేశారు. అందులో భాగంగా 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 55 మంది అవ్వాతాతల కళ్లకు వివిధ రకాల శస్త్రచికిత్సలు చేయాలని నిర్ధారించామ న్నారు. వారందరికీ శంకర్ ఫౌండేషన్ (విశాఖలో) నేత్ర వైద్యులు శస్త్ర చికిత్సలు చేస్తారని, శంకర్‌ఫౌండేషన్ క్యాంపు కోఆర్డినేటర్ సీహెచ్ వెంకటరమణ మాట్లాడుతూ అంధత్వ నివారణకు గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే సేవాకార్యక్రమాల్లో భాగంగా ఉచిత నేత్ర వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది ఆశ వర్కర్లు, శంకర్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వరి పొలాల్లో కాలిబాటలు వేసుకోవాలి

సీతానగరం: పొలాల్లో వరిచేను పిలకలు వేయడానికి అధిక దిగుబడులు సాధించడానికి, తెగులు నివారణ, కలుపుతీయడానికి అనుకూలంగా ఉండేవిధంగా నిర్దేశించిన దూరంలో రైతులు కాలిబాటలు వేసుకోవాలని ఏఓ ఎస్ అవినాష్ సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన మండలంలోని కాశీపేట, తామరఖండి గ్రామాల్లో నాట్లువేసిన వరిచేను పొలాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వరిచేను పెరుగుతున్న సమయంలో నేలకు గాలి వెలుతురు సక్రమంగా తగలకపోవడంతో పంటకు వివిధ రకాల తెగుళ్ల సోకే ఆస్కారం లేకపోలేదన్నారు. అనంతరం వెంకటాపురంలో యాంత్రీకరణ విధానంలో వరినాట్లు వేసిన పొలం, సాధారణ పద్ధతిలో నాట్లు వేసిన పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల రైతులు కె.శ్రీనివాసరావు,వై శ్రీనివాసరావు, ఇతర రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఆధారాలతో అడ్డంగా దొరికారు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: రాష్ట్రంలో 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసి ప్రతి పథకంలో కోట్ల రూపాయల స్కాం చేసి రెండు ఎకరాల స్థాయి నుంచి వేల కోట్ల రూపాయలను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయు డు సంపాదించారని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. చంద్రబాబుకు అన్నివేల కోట్ల రూపాయలు ఎలా వచ్చాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పేరుతో రూ.371 కోట్లు అడ్డంగా దోచుకుని పూర్తి ఆధారాలతో దొరికిపోయిన ఫలితంగా కోర్టు ఆయనకు రిమాండ్ విధించిందన్నారు. పక్కా ఆధారాలతో చంద్రబాబును అరెస్టు చేస్తే టీడీపీ నాయకులు గగ్గోలు పెడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు యత్నిస్తున్నారని ధ్వజమెత్తారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



చరణ్‌తేజ్ (ఫైల్)

గుమ్మలక్ష్మీపురం: విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గిరిజన విద్యార్థి ఆరిక చరణ్‌తేజ్(17) ఆదివారం మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల(బాలురు)లో ఇంటర్మీడియట్ సెకెండియర్ చదువుతున్న చరణ్‌తేజ్ ఆగస్టు 31వ తేదీన కురుపాం మండలంలోని తన స్వగ్రామం ధూళికుప్పకు వెళ్లాడు. ఇంటికి వెళ్లి, జ్వరం బారినపడిన అతడిని వైద్యసేవల నిమిత్తం తల్లిదండ్రులు తేజావతి, సన్యాసిరావు ఈ నెల 5వ తేదీన భద్రగిరి సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికీ జ్వరం తగ్గకపోవడంతో మెరుగైన వైద్యానికి పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న ప్రిన్సిపాల్ యుగంధర్ ఏఎన్‌ఎంతో పాటు, హౌస్ టీచర్‌ను ఆస్పత్రికి పంపించి, తగిన చర్యలు తీసుకున్నారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో విజయనగరంలోని జీజీహెచ్‌కు ఈ నెల 9వ తేదీన రిఫర్ చేశారు. అక్కడి వైద్యులు విశాఖలోని కేజీహెచ్‌కు రిఫర్ చేయగా శనివారం రాత్రి అక్కడ చేర్పించారు. అప్పటికే తీవ్ర అనారోగ్యం బాధపడుతున్న చరణ్‌తేజ్ చికిత్స పొందుతూ మరణించాడు. ఆదివారం ఉదయం మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువచ్చి, అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్ దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం మృతుడి తల్లిదండ్రులకు రూ.10 వేలను అందజేశారు. అలాగే విద్యార్థి మృతికి సిబ్బంది, సహ విద్యార్థులు సంతాపం తెలిపారు.

చివరికి న్యాయమే గెలిచింది..

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం కేసులో అరెస్టయి, రిమాండ్‌కు వెళ్లడంపై పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆదివారం ఓ ప్రకటనలో స్పందించారు. ఇన్నాళ్లకు చంద్రబాబు పాపం పండిందని, ఆయన స్కిల్ డెవలప్‌మెంట్ స్కీంలో రూ.361 కోట్ల ప్రజాధనాన్ని దోచుకుని, ప్రజలను మభ్యపెట్టారన్నారు. నలభై ఏళ్ల రాజకీయ ఇండస్ట్రీ, సత్యశీలుడు, నీతిమంతుడు అని గొప్పలు చెప్పుకుని తిరిగే ఆయన తప్పు ఎట్టకేలకు బట్టబయలైందన్నారు. ఏ తప్పు చేసినా తనకు ఈ చట్టాలు, న్యాయస్థానాలు ఏం చేయలేవని విర్రవీగిన ఆయనకు ఇదొక గుణపాఠమన్నారు.

సిద్ధమైన మట్టి వినాయకులు



విక్రయానికి సిద్ధంగా మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలు

సీతానగరం: వినాయక నవరాత్రి ఉత్సవాలకు సమయం ఆసన్నమవడంతో మండల కేంద్రంలోని కుమ్మరివీధికి చెందిన యువకులు తయారు చేసిన మట్టి విగ్రహాలను ఆర్డర్ల వారీగా పంపిణీకి సిద్ధం చేశారు. రెండు నెలల క్రితం ఉత్సవ కమిటీ సభ్యులు ఇచ్చిన ఆర్డర్ల మేరకు పులబోసిన మట్టితో విగ్రహాలను తయారుచేశారు. కుమ్మరివీధిలో తయారు చేస్తున్న విగ్రహాలను దూరప్రాంతాలకు చెందిన ఉత్సవ కమిటీ సభ్యులు ఇక్కడినుంచి వాహనాలపై తరలిస్తారు. ఒక్కో విగ్రహం రూ.3 వేల నుంచి రూ.50 వేల వరకూ వెళ్తుందని విగ్రహాల తయారీదారు స్వామి చెబుతున్నారు. అలాగే వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని చిన్నపాటి వెయ్యి మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తామని తెలియజేశారు. ఇక్కడ తయారుచేసిన పెద్దవిగ్రహాలను మక్కువ, పార్వతీపురం, బొబ్బిలి ప్రాంతాలకు చెందిన ఉత్సవ కమిటీ సభ్యులు కొనుగోలు చేస్తారని చెప్పారు.

విచారణ జరిపి, చర్యలు తీసుకోండి

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని కె.డి.కాలనీలో ఉన్న గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులను ఓ ఉపాధ్యాయిని బయటకు తీసుకువెళ్లిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పల్ల సురేష్, సీహెచ్ సీతారాం ఓ ప్రకటనలో ఆదివారం డిమాండ్ చేశారు. విద్యార్థినులను పొలంపనుల నిమిత్తం తీసుకువెళ్లారా..లేకపోతే మరేదైనా పనిమీద బయటకు తీసుకువెళ్లారా అంటూ అనుమానం వ్యక్తం చేశారు. అయినా విద్యార్థినులను బయటకు తీసుకువెళ్లేటప్పుడు డిప్యూటీ మేట్రిన్, హెచ్‌ఎం ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.

మట్టి మేలు తలపెట్టవోయ్..

- మట్టి విగ్రహాలే ముద్దు.. పీవోపీ విగ్రహాలు వద్దు..
- వినాయక చవితి వేళ మట్టి విగ్రహాలు వాడాలని కోరుతున్న పర్యావరణ ప్రేమికులు
- ఈ నెల 18న వినాయక చవితి
- పల్లెలు, పట్టణాలు, నగరాల్లో సిద్ధం చేస్తున్న మండపాలు
- విక్రయానికి సిద్ధంగా గణేశుని భారీ ప్రతిమలు



పంపిణీకి సిద్ధం చేసిన మట్టివిగ్రహాల అచ్చులు చూపుతున్న వికాస తరంగిణి సభ్యులు



ఇటువంటి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు స్వస్తి పలుకుదాం

రాజాం సిటీ: వినాయక చవితి అనగానే చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అందరికీ సరదా తెచ్చే అత్యంత ఇష్టమైన పండగ. ఎంత దూరంలో ఉన్నా సొంత ఊరిలో జరిగే వినాయక చవితి వేడుకలకు పట్టణాల నుంచి యువకులు తరలిరావడం, మండపాలు ఏర్పాటు చేయడం వంటివి చేస్తుంటారు. చవితి తొలిరోజు మొదలుకుని, నిమజ్జనోత్సవం వరకు వేరే పనులకు వెళ్లకుండా గణేశుని మండపం వద్దే సందడి చేస్తూ ఉంటారు. ఈ నెల 18వ తేదీన వినాయక చవితి కావడంతో ఊరువాడా అంతా సందడి వాతావరణం నెలకొంది. మండపాలు ఏర్పాటు దగ్గర నుంచి విగ్రహాల ప్రతిష్ఠ వరకు అన్ని రకాల చర్యలకు ప్రణాళికలు రచిస్తున్నారు. పట్టణాలు, పల్లెల్లో వీధివీధినా గణనాథులు కొలువుదీరనున్నారు. అయితే ఈ ఉత్సవాల్లో మట్టి గణపతులనే వినియోగించి, పర్యావరణానికి మేలు చేయాలని పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు కోరుతున్నారు. దీనిపై పల్లెలు, పట్టణాలు, నగరాల్లో ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా, వినాయక చవితి పండగ ఎంతోమంది చేతివృత్తులు, కళాకారులకు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తోంది.

మండపాల తయారీ..

ఈ నెల 18న జరిగే వినాయక చవితి పండగకు అందరూ సిద్ధమవుతున్నారు. పట్టణాలకు దీటుగా గ్రామాల్లోని యువకులంతా ఈ ఏడాది వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఇప్పటికే మండపాల తయారీలో నిమగ్నమయ్యారు. భారీ సైజుల్లో బొమ్మలు కొనుగోలు చేసి, వేడుకగా నవరాత్రి ఉత్సవాలు జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఏడాదికేడాది రెట్టింపు ఉత్సాహంతో పెద్దసైజులో పీఓపీ(ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు కొనుగోలు చేస్తున్న యువత ఈ ఏడాదైనా మట్టి విగ్రహాలను వాడాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

మట్టి ప్రతిమలనే పూజించాలి..

అనాదిగా వస్తున్న ఆచార, సంప్రదాయాలకు అనుగణంగా మట్టి ప్రతిమలనే పూజించాలి. అలా కాకుండా మారుతున్న కాలానుగుణంగా ఎన్నో ఆకృతులు, రంగురంగుల వినాయక ప్రతిమలు అందుబాటులోకి రావడంతో యువత వాటికి ఆకర్షితులై, మొగ్గుచూపుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బొమ్మలు పర్యావరణానికి హానికరమని తెలిసినప్పటికీ హంగులు, ఆర్భాటాలకు పోయి అధికంగా ఖర్చు చేసి వాటిని కొనుగోలు చేస్తుండడం విచారకరం.

మట్టి విగ్రహాలతో లాభాలు..

- సహజ సిద్ధంగా పొలాల్లో దొరికే బంకమట్టితో విగ్రహాలు తయారు చేసుకోవడం మంచిది. ఇవి నీటిలో సులభంగా కరిగిపోతాయి.
- మట్టి విగ్రహాల నిమజ్జనంతో నీటి వనరులకు ఎలాంటి నష్టం వాటిల్లదు.
- సహజ సిద్ధ రంగులతో తయారైన బొమ్మల ద్వారా జలచరాశులకు ఎటువంటి హాని కలగదు.

రసాయనాలతో అనర్థాలు..

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాలు చెరువులు, నదుల్లో నిమజ్జనం చేసినా అవి కరగవు. వీటితో తయారైన ప్రతిమల్లో జిప్సం, గంధకం, మెగ్నీషియం, పాదరసం, సీసం, కాడ్మియం, ఆర్గానిక్స్, కార్బన్ వంటి రసాయనాలు ఉంటాయి.
- వీటికి పూసిన రంగులు నీటిని కలుషితం చేస్తాయి. ఈ నీటిని తాగిన పశువుల్లో జీర్ణకోశ వ్యవస్థ దెబ్బతింటుంది.
- రసాయనాలు కలిపిన నీటి మూలంగా చర్మవ్యాధులు వస్తాయి. శరీరంలో నరాలపై ప్రభావం చూపి క్యాన్సర్ వ్యాధికి దారితీస్తుంది.
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నీటిలో కరగడానికి కొన్నేళ్ల సమయం పడుతుంది. నీరు, నేల, గాలి అన్నింటిపై కాలుష్య ప్రభావం పడుతుంది. ఇది జీవరాశుల మనుగడపై ప్రభావం చూపుతుంది.
- రసాయన రంగులు కలిపిన నీరు పంటపొలాలకు చేరడంతో దిగుబడులు తగ్గడమే కాకుండా ఆహార ఉత్పత్తులు కలుషితమవుతాయి.

మట్టి ప్రతిమల అచ్చుల పంపిణీ..

మట్టి వినాయక ప్రతిమల అచ్చుల పంపిణీకి స్వచ్ఛంద సంస్థలు ముందుకొస్తున్నాయి. పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంల ద్వారా పంపిణీ చేపట్టనున్నారు. ప్రతీ ఏడాది మాదిరిగానే అచ్చులు విద్యార్థులకు అందించి, మట్టిబొమ్మలు తయారు చేయించడమే లక్ష్యంగా ముందుకువెళ్తున్నారు. వాసవీక్లబ్ మనరాజాం-సారథి సభ్యులు ఇప్పటికే అచ్చులు తయారు చేయించి, విద్యార్థులకు అందించేందుకు సిద్ధమయ్యారు.

ప్రకృతి వ్యవసాయం జీవన విధానం కావాలి



రైతులతో మాట్లాడుతున్న ఏపీ గాంధీ స్మారక నిధి ఉపాధ్యక్షుడు చక్రపాణి

గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయం మన జీవన విధానం కావాలన్న మహాత్మాగాంధీజీ నినాదాన్ని అందిపుచ్చుకోవాలని ఏపీ గాంధీ స్మారక నిధి ఉపాధ్యక్షుడు చక్రపాణి అన్నారు. ఆదివారం మండలంలోని రాయగడ జమ్ము పంచాయతీలో జట్టు ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజానికి గాంధీ మహాత్ముని విశిష్టత తెలియజేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. గాంధీజీ ఆచరించిన సత్యం, అహింసా మార్గాలను అందరూ అనుసరించాలన్నారు. పాఠశాలల్లో గాంధీజీ గూర్చిన అంశాలు చర్చించేలా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. చిన్ననాటి నుంచే ప్రకృతి వ్యవసాయం విధానాలు తెలుసుకునేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో మద్యపానం, ధూమపానం వంటి చెడుఅలవాట్ల బారిన యువత పడకుండా చూడాలన్నారు. రాయగడ జమ్ము పంచాయతీలో గత నాలుగేళ్ల నుంచి మద్యపాన అమ్మకాలు, నాటుసారా తయారీ నిషేధించామన్నారు. జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకుడు డి.పారినాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతీ కుటుంబానికి పెరటి తోటలు ఉండాలని, చిరుధాన్యాల సాగు, వినియోగం పెంచాలన్నారు. మహిళలు మాట్లాడుతూ మేము ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరిస్తూ ఆరోగ్యకరమైన ఆహారం సమాజానికి అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ ఎం.నూకంనాయుడు, మా తోట కమిటీ అధ్యక్షుడు తాడింగి జమ్మయ్య, సర్పంచ్ అమల తదితరులు పాల్గొన్నారు.